# జరిమానా

అయిలయ్య చెక్కబెంచీపై ముసలికోతిలా ముడుచుకుని కూర్చున్నాడు.

మొట్ట మొదటిసారి పామును చూసిన పసివానిలా అతనా కోర్టు వాతావరణాన్ని చూసి భయపడ్డాడు.

తనో పాముల పుట్టలోకి చొచ్చుకొచ్చి కూర్చున్నట్టు అదిరి పడుతున్నాడతను.

నల్లకోట్లు వేసుకుని అటు, యిటూ తిరుగుతున్న వాళ్ళు నవ్వుతున్న యమభటుల్లా కనిపిస్తున్నారు అయిలయ్యకు. తనలా ఏ పనుల మీదనో వచ్చి పడిగాపులుగాస్తున్న వాళ్ళు రావణుని రాజ్యంలో బందీలైన నవగ్రహ గణాల్లా కన్నుల్లో ప్రాణాలను పెట్టుకుని పంజరంలో పక్షుల్లా చూస్తున్నారు. అక్కడక్కడ తిరుగుతున్న పోలీసులు నాలుకలు చాపుక్కూర్చున్న బల్లుల్లా అతి గంభీరంగా కనబడుతున్నారు.

ఉదయం పదిగంటలనుంచి కూర్చున్న అయిలయ్య విసిగి విసిగి సాయంత్రం నాలుగ్గంటలవరకు ఓ పాతిక బీడీలనూ రెండు అగ్గిపెట్టెలనూ కాల్చి ఓ కానిస్టేబుల్‌కు నాల్గు చాయ్‌లు తాగించి దోస్తీ చేసి కొన్ని కొత్త బూతులు నేర్చుకున్నాడు.

"ఏ జన్మలో ఏ పాపం చేసిన్నో యీరోజు ఉమ్మిలోపడ్డ ఈగలా యీ కోర్టులో చిక్కి ఏడుస్తాన" అని తుపుక్కున ఉమ్మేసి యిరవయ్యారో బీడీని అంటించుకున్నాడు.

"... హాజిర్ హో...." అని అరిచాడు మళ్ళీ బంట్రోతు. బంట్రోతును చూసినపుడల్లా తన గుడిసె పక్కనున్న... రైస్‌మిల్లు చిమ్నీగొట్టం జ్ఞాపకమొస్తోంది అయిలయ్యకు చటుక్కున. ఎవరో పరుగు పరుగున వెళ్ళారు జడ్జిగారున్న గదిలోకి...... సర్కస్ బోన్‌లోకి నడుస్తున్న జంతువులా.

యింతలో ఓ పోలీస్ వ్యాన్ సర్రున దూసుకొచ్చింది మెట్ల దగ్గరికి.

ఓ పోలీసు గబగబా దిగివచ్చి వెనుకడోర్ తెరిచాడు.

ఓ ఏడెనిమిదిమందున్న అడవాళ్ళ గుంపు దిగింది.

ఒకటి... రెండు.... మూడు .... అందరినీ పరిశీలనగా చూశాడు అయిలయ్య. అందరి ముఖాలూ చెదలుపట్టిన కర్రల్లా వున్నాయి. దాంట్లో దాదాపు అందరూ పాన్‌లు నములుతున్నారు. అందువల్ల వాళ్ళనోళ్ళన్నీ పామును తిన్న ముంగిస మూతుల్లా ఎర్రగా ఉన్నాయి. కాని వాళ్ళ ముఖాల్లో ఏ మాత్రం బాధలేదు. సంతోషంగా కనిపిస్తున్నారు.

ఆడవాళ్ళంతా వరుసగా వచ్చి నిలబడ్డారు అయిలయ్య కూర్చున్న బెంచీప్రక్కన.

"ఏంది సంగతి" అన్నాడు పోలీస్ దోస్తుతో.

"కంపిని సరుకు"

"ఓ-"

మళ్ళీ "సరుకు" ముఖాల దిక్కు చూశాడు.

"ఎందుకొచ్చింన్రిక్కడికి?"

"రాలేదురా ఎదవనాయాలా. పట్కొచ్చింన్రు. యియ్యాల తారీకెంత... యిరవయ్యారు. పోలీసుల కేసుల కోటా నిండనట్లున్నది. నింపుతాండ్లు-"

"మరిప్పుడేం జేత్తరు"

"ఏమున్నది బే. కొత్తరా, సంపుతరా, నీ లెక్కనే వాళ్ళదీ ఓ కేస్. జడ్జి అడుగుతడు. ఫైనేత్తడు. పొమ్మంటడు. మీరందరు ఫైన్ కట్టాలే. పోవాలే-గంతే"

"అటెంక"

"వాళ్ళు మల్లా కంపిని నడిపిత్తరు. నువ్వు మల్లా నడిరోడ్డు మీద నీ పండ్ల బండి పెట్టి యిల్లెక్కికూసే పుంజోల్లె అమ్ముకుంటా"

"మరి ఈ కోర్టుగిలెందుకు. ఫైనెందుకు-జడ్జెందుకు".

"అదీ... అదంతే..."

"థూ... దీనమ్మ....ఏం కానూనిది. మనిషిని మారుస్తాది బే కానూన్. అంతా బూటకం...."

"ఒరే ఐలిగా.... కానూన్‌గాదురా... ఈ మన జిందగీ ఉన్నది సూసినవ్ ఆ బ్రతుకే ఓ బూటకంరా" పోలీస్ శివయ్య వేదాంతిలా నవ్వాడు.

అయిలయ్య చేతిలోని బీడిని బెంచీచెక్కకు రాసి నులిమి బయటకు విసిరేసి తనకు దగ్గరగా దాదాపు తన ఒంటిని తాకుతున్నట్లుగా నిలబడ్డ "సరుకు" బాపతు ఆడ మనిషి దిక్కుచూశాడు.

"ఏందీ సంగతి. ఈడకూడా గిరాకీకోసం సూత్తాన్నవా" అన్నాడు చటుక్కున.

ఆమె ఉలిక్కిపడి అయిలయ్య దిక్కుచూచి మంట తాకిన మనిషిలా ప్రక్కకు జరిగింది "నీ పేరేంది..." అన్నాడు.

"..." ఆమె చెప్పలేదు నిశ్శబ్దంగా చూచింది.

"అయ్యో చెప్పరాదో..." ఊరిచెరువు మీద ఊళ్ళోని ప్రతివానికి హక్కు వున్నట్టు ఆమె మీద తనకు తెలియకుండానే తనకు సంక్రమించిన హక్కుతో అడిగాడు అధికారికంగా.

"జయమ్మ" అంది ముఖం అటు తిప్పుకుంటూ.

అక్కడున్న ఎనిమిది మంది ఆడవాళ్ళలోనూ జయమ్మే వయసులో వుంది. కొత్తగా వుంది. వినయంగా వుంది. అయిలయ్యకు ఆశ్చర్యమేసిన యింకో విషయమేమిటంటే జయమ్మ మిగతా వాళ్ళతో కలిసి ఉండడంలేదు. వాళ్ళతో కాకుల మందలో కలిసిన కోకిలలా విడిగా ముభావంగా వుంటోంది.

కథా నిలయం
శ్రీకాకుళం

"నీది వాళ్ళ కంపిని కాదా"

"కాదు-"

"ఒక్కదానివి వేరేనా"

"మావోళ్ళెవరూ లేరు. నన్నొక్కదాన్నే పట్కచ్చింద్రు"?

"కచ్చీరు కచ్చినవా యిదివరకు"

"ఊహుఁ.... యిదే మొదలు".

"అచ్చా.... మరి యీడపైనేస్తే ఎవలు కడ్తరు"

"మా మనిషి యిప్పుడచ్చి ఓ ముప్పయి రూపాలిచ్చి పోయిండు. పైనేస్తే కట్టి యిడిచేస్తే మల్లా మాపటికి వాళ్ళ దగ్గరికి పోవాలె."

"పోకుంటేమైద్ది."

"అబ్బో... నన్ను మల్ల ఎంకులాడి పట్కచ్చి గొడ్డును కొట్టినట్టు కొడ్తరు."

"యిగ నువ్వు యీ పనినుంచి బైటపడలేవా..."

"ఊహుఁ.... కత్తుల బోన్లబడ్డట్టే. నా బతుకే నాశనమై పోయింది." ఆమె ముఖం పలుగురాయిలా వున్నదల్లా కరుగుతున్న మంచుగడ్డలా ఐపోయింది.

"ఐలయ్యా హాజరే..." అని అరిచాడు బంట్రోతు.

"....పోవో.... నువ్వే... వచ్చింది నీ పేరే...." అన్నాడు పోలీసు అయిలయ్యను చేతిలోని కర్రతో పొడుస్తూ.,

"వచ్చె-"

లేచి మాసిన అంగీని దులుపుకుంటూ బంట్రోతు దగ్గరికి ఉరికి....వాడు చూపించిన హాల్లోకి నడిచి చాకలివాని ముందర గాడిదలా అతి వినయంగా నిలబడ్డాడు.

ముందర నల్లకోటు వేసుకున్న ప్రాసిక్యూటర్ కరువబోయే పాములా ఉన్నాడు.

ఎదురుగా జడ్జి ఎవని ఏడ్పు పట్టించుకోని రాతిదేవునిలా నిర్మలంగా కూర్చున్నాడు.

"అయిలయ్య నువ్వేనా...." ప్రాసిక్యూటర్ ప్రశ్న.

"ఔ న్సార్"

"రోడ్డుమీద బండిపెట్టి పండ్లమ్మావా"

"ఔన్సార్"

"పదిరూపాయలు కట్టిపో" రాతిదేవుడు మాట్లాడాడు.

"కని...సార్ మరి నూకుడు బండ్లోళ్ళం రోడ్డుమీదగాకుంటే మరి ఎక్కడమ్మకోవాలె"

"ఎదురు ప్రశ్నేస్తాన్నావ్...." ప్రాసిక్యూటర్.

"ఇరవై రూపాయలు ఫైన్" రాతిదేవుడు

"అదిగాదు సార్..." యింకేదో అనబోతూండగా....

" ముప్పయి రూపాయలు..." అన్నాడు జడ్జి కఠినంగా.,

అయిలయ్య బాణం దిగిన పక్షిలా చూచి.... నోరు మూసుకుని.... చిరుగులుపడ్డ జేబులో నుంచి మాసిపోయిన ముప్పయి రూపాయల చిల్లర క్లర్కుదగ్గరకట్టి స్మశానంలో నుంచి వస్తున్న మనిషిలా బయటికొచ్చాడు.

అతను బయట కొస్తూండగా...

"జయమ్మా హాజరే" అని అరుపు వినబడింది.

అతను చూస్తుండగానే జయమ్మ లోపలికి వెళ్లింది సర్కస్‌లో ప్రేక్షకుల ముందు నుండి బోనులోకి పోతున్న జంతువులా.

అయిలయ్య వచ్చి అరుగుపై నిలబడి ఆకాశంలోకి చూస్తూ వుండిపోయాడు.

ఐదు.... మాట్లాడితే పది... యింకా మాట్లాడితే పదిహేను. ఇంకా మాట్లాడితే....?

ఐదు....పది....పదిహేను

"ఛూః వీన్తల్లి ఏం నాయం యిది?"

ఒకటి... రెండు... మూడు పది నిముషాలు గడిచాయి.

జయమ్మొచ్చింది.

ఆమె ముఖంలోకి చూశాడు. మురిగిన పండులా వుంది.

"ఏమైంది" అన్నాడు.

"పది దినాలు జైలన్నా.... ఇరవై ఐదురూపాల్ జుల్మానన్నా కట్టుమన్నాడు."

"ఊః..."

"ఇరవై ఐదు కట్టిన"

తర్వాత అతను మాట్లాడలేదు. ఆమె మాట్లాడలేదు.

....నిశ్శబ్దం యిద్దరి నడుమ.

"యిగ పోదాం..." అంది కాస్సేపయింతర్వాత.

"ఏడికి"

"నేను మల్ల ఆ నరకంలకు పోతా...."

"ఆగు...."

అప్పటికే ఐదున్నరైపోయింది. చాలామంది జనం వెళ్ళి పోయారు. నల్లబట్టలేసుకున్న లాయర్లందరూ వెళ్ళిపోతున్నారు కార్లలో.

పరిశీలనగా చూస్తున్నాడు అయిలయ్య పోతున్న నల్లకోట్ల వంక -

ఓ ఐదునిమిషాల తర్వాత ఓ గున్న ఏనుగులాంటి మనిషి కారు దగ్గరికి వస్తూంటే.

"అయి నెవ్వరు...." అన్నాడు అయిలయ్య జయమ్మకు చూపిస్తూ.

"ఇంతకుముందు మనకు జుల్మానావేసిన జడ్జి..."

"పా..." అని గబగబా నడిచాడు. ఆమెవెంట నడిచింది.

అతను జడ్జిగారి కారుకు ఎదురుగా నిలబడ్డాడు.

"ఏందిరా" అన్నాడు జడ్జిగారు.

"అయ్యా.... మాకు యింతకుముందు జుల్మాన నేసిండ్లు గదా నేను రోడ్డుమీద బండిపెట్టుకుని అమ్ముకున్నందుకు. యిది ఒళ్ళమ్ముకున్నందుకూ".

"ఐతే ఏమిటి?"

"మరి రేపటినుంచి మేమేం జేయాలె"

"ఏం జేస్తరు.... మళ్ళీ నువ్వుపండ్లమ్ముకో, అది ఒళ్ళమ్ముకుంటది"?

"మల్లా పట్కత్తె."

"మళ్ళీ ఫైనేస్తా"

"మరి మీరీ ఫైనెందుకేత్తానట్టు..."

"అది నా డ్యూటీరా పిచ్చివాడా. రోడ్డుమీదబడి బతకటం నీ డ్యూటీ. నిన్ను పట్టుకురావడం పోలీస్ వాళ్ళ డ్యూటీ. మీకు ఫైన్ వేయడం నా డ్యూటీ...."

"యిగ మా బతుకులన్నీ ఫైన్లేనా.... యీ జుల్మానా బతుకు నుంచి మమ్ముల్ని రచ్చించండి బాబూ."

"ఎవడ్రా రక్షించేది.... ఏడ్వండి రోడ్డుమీదపడి.... డ్రైవర్, పోనీ...."

కారు బాణంలా దూసుకుపోయింది.

నిలబడ్డ యిద్దరికళ్ళలోనూ దుమ్మువడింది పూర్తిగా .

(నాకు నచ్చిన కథ - పెద్దిబొట్ల సుబ్బరామయ్య)
'స్వాతి' మాసపత్రిక, నవంబర్,1979